సత్యాగ్రహం

"ఏడు కొండలెను
గోడికూసెను
తెల్లవారెను
మెల్ల మెల్లన"

రాజయ్య ఇల్లు శుభ్రం చేస్తున్నాడు. వంటింట్లోంచి సరోజ హడావిడిగా హాల్లోకి వచ్చి "ఏరా ... ఆమూల కేడియోమీద దుమ్ము అట్లాగే వుందేం?" అని అడిగింది.

"ఇప్పుడే తుడిచానమ్మ."

"ఓరీ! చూస్తూ చూస్తూ వుండగా నే ఇంత అబద్ధమట్రా!"

"నిజంగా ఇప్పుడే తుడిచానమ్మ."

"మరి ఇంత ధూళి ఎక్కడిదీ?"

"అదేమో? బహుశా ఈ హైడ్రోజను బాంబులు పేలడంవల్ల—"

"బావుంది. చాలబావుంది. ఆయన వినాన్నరంటే నీ బుర్ర పేలుతుంది." అన్న సరోజకు ఇంకా ఆరోజు 'ఆయన' అన్న వస్తువు చలామణీలోకి రాలేదని స్ఫురించింది.

"ఏవండోయ్"

"అహా!"

"లేవండీ..."

"ఓహో!"

"ఏవిటీ అహో-ఓహోలు?" అని శేషగిరి రెండు చెవులూ పట్టుకుని లేపి కూర్చోబెట్టింది సరోజ.

"అబ్బే. మరేమీ లేదు. పొద్దునే నీవలా వచ్చి పక్కన కూర్చుని 'ఏవండీ - లేవండీ' అని మధురమధురంగా, లలిత లలితంగా, యతిప్రాసలతో పలుకుతుంటే హృదయం-"

"కవిత్వం - చంద్రుడూ వగైరా వచ్చిం తర్వాత! ముందు ముఖ ప్రక్షాళనం కానివ్వండి."

"అవశ్యమల్లే కానిండు."

"ఏవండీ"

"ఎస్"

"కాఫీ ఎట్లా వుందీ..."

"ఏ కాఫీ?"

"ఏ కాఫీ ఏమిటీ? మీరు తాగుతూ వున్నదీ..."

"ఐ యామ్ సారీ... నేను తాగుతోంది కాఫీకదూ..."

"అవున్లెండి! మేం చేసిఇస్తే అది కాఫీ ఎలా అవుతుందీ?— మీ అక్కయ్యో, చెల్లెలో, అంత టర్పెంటైనూ ఇంత పెట్రోలూ కలిపి ఇస్తే 'ఆహాహా' అని తాగుతారు."

"సరోజా, సరోజా, ... శ్రావణశుద్ధ పౌర్ణమిపూట అలా మావాళ్ళమీద పడిపోకూ...పాపం! ఎక్కడో వందల మైళ్ళ దూరంలో వున్నారు."

"ఇంతకూ నేనేగా పరాయి దాన్ని!"

"పాపము శమించుగాక...సందు దొరికితే మావాళ్ళమీద అస్త్రాలు సంధించకూ— అన్నా. అంతేగాని..."

"పొద్దున్నే ఇదెందుకుగాని,... ఇవాళ సాయంకాలం నన్ను ఎగ్జిబిషన్‌కు తీసుకు వెడతారా - లేదా?"

రంగారావ్

"ఏ ఎగ్జిబిషనూ?"

"రోజూ అడుగుతున్నదేగా..."

"ఓకే...అలాగే! వెళ్ళిపోదాం"

"నిజమేనా?" అని కుర్చీ ప్రక్కకొచ్చింది సరోజ.

"ఖచ్చితంగా"

"మావారు ఎంత మంచివారో..." అని సరోజ శేషగిరి మొహానికి మొహం ఆనించి, పరుగెత్తుకు వెళ్ళిపోయింది.

శేషగిరి కాఫీ ముగించి కప్పు క్రింద పెట్టాడు. కుర్చీనుంచి ఎగిరి ఒక్క గంతేశాడు. కప్పును, కుర్చీకాలు ధృతరాష్ట్రుడిలా కౌగలించుకుంది. సరోజవంటింటినుండి పరుగెత్తుకొచ్చింది.

"సరోజా!"

"ఏవిటండీ?"

"ఎగ్జిబిషనుకు ఇవాళ వీలులేదు."

"ఏమంటున్నారూ?"

"సాయంకాలం ఎగ్జిబిషనుకు వెళదాం అనుకున్నాం కదూ..."

"ఊఁ."

"అలా జరగడానికి నయాపైసాఅంత అవకాశం కూడా లేదు."

అప్పుడే అనుకున్నాను—ఇంత హాతాత్తుగా ఒప్పుకున్నారే—అని."

"శభాష్! ఆదర్శసతీమణి అంటే నీవే సుమా..."

"భట్రాజు దండకాలు దండుగ..."

"అసలు విషయం తెలుసా?"

"తెలియక్కర్లేదు."

"ఎంతమాట! భావిభారత పుత్రుల తల్లివి కానున్న నారీమణివి, వీరపత్నివి—నీవు అలా త్రోసిపారేయడానికి వీలులేదు." అని నాటకం హీరోలా సరోజచేతిని తన రెండుచేతుల మధ్యకు తీసుకున్నాడు.

"అవతల కుంపటి—"

"ప్...అలాంటి చిల్లర విషయాలకు ఇపుడు అవకాశంలేదు. ఇవాళ విశేషం ఏవిటో ఎరుగుదువా?"

"ఏవిటి?"

"ఆఫీసు లేదు."

"ఆదివారం కాదుగా."

"అవును."

"పండగరోజు కాదుగా"

"కాదు. కానీ...అమ్మాయ్! నీ మొగుడుగారు పనిచేస్తున్న శాఖవారు ఇవాళ జీతాల హెచ్చింపు కోసం సమ్మె చేస్తున్నారు... సమ్మె!"

"క్ క్...ఇంతేనా..."

"ఏవిటి...! విశాల భారతంలో కాశ్మీరు మొదలు కన్యాకుమారి వరకూగల ఉద్యోగస్థులందరూ బుర్రలు బద్దలుకొట్టుకుని ఆలోచించి, చచ్చిచెడి ఐకమత్యం తెచ్చుకుని సమ్మెచేస్తూంటే నీవు—'ఇంతేనా' అంటున్నావు..."

"ఈ విషయం ముందే ఏడవ కూడదూ?"





★ సత్యాగ్రహం ★

"ఏది.. నీచేతి కాఫీ తాగితేదాక గుర్తుకు రానిదే. "

"సరే సరే.. నాకా ఎగ్జిబిషను చూసే రాత లేదు."

అబ్బే! అలా నిరాశతో నిండిపోకు. ఇవాళ సమ్మె కబీపాటికి ప్రభుత్వంవారు తొమ్కన ఏ పాలికరూపాయలో జీతం పెంచేస్తారు ఆ అంతే—ఝామ్మున ఎగ్జిబిషనుకు—టాక్సీలో వెళ్లిపోదాం ఏం. సరేనా?"

"ఊ" అని నోరు వంకరలు తిప్పింది సరోజ.

"అహా! ఏమా సోయగము!"

"నే పోతున్నా..."

"అలాగే. "

"మరి చేయి వదలండీ ."

"ఓ.. మరి నేను అలా వీధిలోపడి సమ్మె ఏమయిందీ, ఎందాక వచ్చింది, నాయకులు ఏమంటున్నారు, మన పాలిక రూపాయలు ఏమయాయి, వగైరా భోగట్టా కనుక్కువస్తా—" అని శేషగిరి బయటకు వెళ్లిపోయాడు.

మిడిమిడి ఎండలో తిరిగితిరిగి, గొంతు చించుకుపోయేటట్లు అరిచి, వచ్చినగమై మధ్యాహ్నం ఒంటిగంటకు శేషగిరి ఇల్లు చేరుకున్నాడు. హాల్లో ఈజీచేరులో చేరబడ్డాడు.

వంటింటిప్రక్క వసారానుంచి ఆడ గొంతుకలు వినిపిస్తున్నాయి. 'ప్రశ్నలూ—జవాబులూ' కొంత ఘాటుగానే సాగుతున్నాయి.

"నేనంటున్న దేమిటంటే మా ఆయనకన్న మీ ఆయనకు ఓమూడ్రెండు రూపాయలు ఎక్కువ వస్తాయికదా— మీ ఆయన వాళ్లు సమ్మెచేయడం ఏమిటి—అని"

"అదేం వచ్చుప్రశ్న? మాకు జీతం చాలలేదూ—అంచేత మరికొంత కావాలని సమ్మెచేస్తున్నాం "

"మరి మా జీతంమాత్రం మాకు చాలుతుందేం?"

"చాలక పోవచ్చు "

"మరి మా ఆయనా వాళ్ళూ సమ్మెచేయనక్కరలేదా?"

"చేయాలి"

"మరి చేయరేం?"

"అదేమో బహుశా మీ వాళ్ళ" ఆమాత్రం ఐకమత్యం లేకపోవచ్చు.. లో

"దరిద్రంలో కొట్టుకులాడుతూన్నప్పుడు కూడా అనైకమత్యమే?"

"అలాగే అనిపిస్తూంది—మరి"

"అదేదో అంతు కనుక్కోవాలి. మా ఆయన వాళ్ళకాఖ మాత్రం ఎందుకు సమ్మె చేయదూ—అని... ఇవాళ ఆయన ఆఫీసు నుండి రాగానే అదేదో తేల్చుకుంటా.. "

—ఇదంతా ఏ పక్కింటి రేడియోనుంచో విన్పిస్తున్న మహిళల ప్రోగ్రాము కాబోలు ననుకున్నాడు శేషగిరి మొదట. కాని వంటింట్లోనుండి హాలుదాటి వెళ్ళిన కాంతను చూచి,

—"ఓహో! సమ్మెను విశదీకరించింది మా ఆవిడా, వాళ్ళాయనచేత సమ్మెచేయాలని కంకణం కట్టుకున్నది ఈవిడానా?"—అనుకున్నాడు శేషగిరి

"ఎప్పుడొచ్చారండీ మీరు?" సరోజ హాల్లోకి వచ్చింది

"నీవు ప్రక్కింటావిడకు మా సమ్మెను గురించి వివరించడం మొదలుపెట్టినప్పుడు..."

"భోజనానికి లేవండి "

వడ్డిస్తూ "ఏమయింది మీ సమ్మె?" అంది సరోజ

నోట్లోఉన్న ముద్దను గభుక్కున మింగి "అర్ధాంగి అటులనుట న్యాయమే? ఇంత సేపూ ఆవిడతో ముద్దుముద్దుగా 'మా రేడియో' 'మా కారు' అన్నట్టు 'మా సమ్మె మా సమ్మె' అని మాట్లాడి— ఇప్పుడు "మీ సమ్మె" అంటున్నావే.. ప్లేటు ఇలా మారిస్తే ."

"సరే బాబూ సరే! ఎలా ఉంది మన సమ్మె?"

"ఆ...అదీ వరస! మన సమ్మెకేం—దివ్యంగా సాగుతూంది "

యుద్ధపద్ధతి

"యుద్ధాలెలా వస్తాయి నాన్నా?" అని అడిగాడు అబ్బాయి.

"ఏం లేదురా, మనకీ అమెరికావాళ్లకీ ఏదో డబ్బు దగ్గిరో, ఎక్కడో పేచీ వస్తుందనుకో .."

భర్త మాటలకి భార్య అడ్డం వచ్చి "మీరిలాంటివన్నీ వాడికి నేర్పిపెట్టకండి. అమెరికావాళ్లు డబ్బు దగ్గిర ఎప్పుడూ దెబ్బలాడరు," అంది.

"ఎందుకు దెబ్బలాడరూ? డబ్బుదగ్గిర ఎవరైనా ఒకటే," అన్నాడు భర్త

"కాదు," అన్నది భార్య.

"అవు" నన్నాడు భర్త.

"అఘోరించార్లెండి "

"పడిశావులే"

"నోరు ముయ్యండి "

" ఆఁ," అంటూ భర్త కొట్టడానికి లేచాడు.

అబ్బాయి అడ్డపడి "తెలిసింది నాన్నా. యుద్ధాలిలాగే వస్తాయన్నమాట. బలేగా ఉందే," అని మురిసిపోయాడు.

"సాగడం కాదు ... అసలు విషయం ఏమయినా—"

"అదా ... రాత్రి ఢిల్లీనుండి వార్తలు రేడియోలో విను. పాతికరూపాయల హెచ్చింపుగురించి వింటావు. ఆ! అంతే దానికి తిరుగులేదు."

"మీకు అంత నమ్మకం వుందా?"

"ఆహా! ప్రభుత్వం మా సమ్మెకు ఒక్క రోజు తట్టుకోలేదు. చచ్చినట్టు క్రిందకు దిగి తీరవలసిందే!"

"అయితే ఎగ్జిబిషనుకు రేపు వెళ్ళడం ఖాయమే నన్నమాట."

"ముమ్మాటికీ!...మరి నీ వింతసేపూ సమ్మె తరఫున మన ప్రక్కింటావిడతో వాదించావుగా...అందుకు బహుమతి ఇవ్వవద్దూ?"

"మరేమిటండీ? వాళ్ళాయినా వాళ్ళూ సమ్మె చేయలేదుట." అంది సరోజ పులుసు వడ్డించబోతూ.

"పాపం" అన్నాడు శేషగిరి.

చేతిలోని పులుసుగరిట నలాగే పైకెత్తి పట్టుకుని సరోజ "ఏం" అంది.

"ఆ...ఆ...ముందు ఆగరిట క్రిందకు దించూ...పులుసు చీరమీద పడగలదు" అని సరోజచేతిని క్రిందకు దించి,

"ఇప్పుడు చెబుతా విను—మా కంటే ఓ సంఘమూ వగైరా ఏడిశాయి. వాళ్ళకవి లేవుగా..."

"అయితే?"

"అందరూ ఒక్క తాటిమీద నిలబడక పోతే సమ్మె ఎలా చేస్తారూ?"

"ఔను."

"వాళ్ళాయనచేత సమ్మె చేయించి తీరుతానని వెళ్ళిందికదా ఈవిడ!—పాపం ఆయన సాయంత్రం ఇంటికి రాగానే ఎన్ని గండాలున్నాయో అని బాధగా వుంది..."

"ఉండదూ...తోటి మగప్రాణిగా..."

"మరే..."

"చాలు చాలు! ఆయనకు మీ సానుభూతేం అక్కరలేదు."

—సాయంకాలం ఏడింటికి శేషగిరి బ్రహ్మాండమయిన ఊరేగింపులో వున్నాడు. అదయిన తర్వాత సమ్మెకట్టినవారు సభ జరిపారు. ఉపన్యాసాలు అయిపోయాయి. ఆ తర్వాత చెవులు నిక్కపొడుచుకుని పార్కు రేడియోలో వార్తలు విన్నారు.

"ఇవాళ ఫలానావారు సమ్మె చేశారు... ప్రభుత్వంవారు ఈ విషయమై ఎలాంటి ప్రకటనా చేయడానికి నిరాకరించారు. ఈ సమ్మె రేపుకూడా జరుగుతుందని భావిస్తున్నారు—"

శేషగిరికి సగంప్రాణం పోయింది. ఇల్లు చేరుకున్నాడు.

హాల్లో లైటు లేదు. వంటింటికి గొళ్ళెం పెట్టివుంది. రేడియో ఏదో పలుకుతూంది. సరోజ పడకగదిలో మంచంమీద బోర్ల పడుకుని వుంది.

"రేపుకూడా ఎగ్జిబిషనుకు వెళ్ళే అవకాశం ఉన్నట్టు కనుపించనందువ ఇవాళ నుంచే సమ్మె' అని వాతావరణం శేషగిరి చెవిలో ఘోషించింది.

ఎందుకో దాచుకున్న మూడు రూపాయలు పట్టుకుని దగ్గర్లో చూపెడుతున్న ఒక తెలుగుసినిమా సెకండుషోకు రెండు టిక్కట్లు పట్టుకొద్దామని—"సిరికిం చెప్పడు"—ధోరణిలో పరుగెత్తాడు శేషగిరి.

శేషగిరిని చూచి "పాపం!" అనుకున్నాడు ప్రక్కింటి శాంత మొగుడు. ★

నయాపైసా దండకం

శ్రీదేవి విన్యాస, ఓం క్రీం నయాపైస నీకోస మీదాసు డాయాసమున్ పైచి ఆఫీసు ముంగిళ్లలం వేచి, చేజాచి వీక్షించి హాస్యించుచున్ గ్రక్కునన్ పేటికే తెంచి కీర్తించి నిన్ గాంచి మోదంబు నందంగ, నాబాలగోపాలమున్ లీల లాలించ నేతెంచు నోచిద్విలాసా, నయాపైస, ఓ హేమలంబాదభాసా, దశాంశాది రూపప్రకాశా, సమర్పింతు నీవచ్చు వేళన్ నమోవాక్కు లెన్నెనియున్!

ఈరేడు లోకాల నీకీడు జూడంగగాలేదు, నాయండ నీవుండ నాకుకే గుండు సైతంబు దాసానుదాసుండుగా నుండడే, దండముల్ బెట్టడే, నీదు తోబుట్టు కంటన్నడు న్వెంటనే పంచ బంగాళిపై భీతిమైపొంబడే, శూన్యమై పోవదే, ఘల్లుఘల్లంచు గర్జించగానే శివంబుల్ వికాసాకృతిన్ లేవదే, కూడి కల్ తోపుడుల్ పెంచుటల్ భాగహారాది సౌలభ్యసంధాయినీ, కష్ట నిర్మూలినీ, దుఃఖసంహారిణీ, లోభిమూకావళీ చిత్తసంచారిణీ, పద్మినీ రాగిణీ, మోహినీవార నారీమణీ చిత్తసమ్మోహినీ, విశ్వసంభావనీ, పావనీ, నీదువర్ణంబు తామ్రంబు రూపంబు రమ్యంబు, నామంబు దివ్యంబు, నీయాగమంబున్ రహస్యంబు, గమ్యంబు వేగంబు, మాయంబు మర్మంబు వ్యాప్తంబు సర్వంబు, లభ్యంబు హార్షంబు, జన్యంబు కోశంబు, చిత్తంబు చాంచల్య తత్త్వంబు, క్రీడాభిరామంబు మాదివ్య ఖండంబు, శూన్యంబు వంత్యంబు నిన్ గూర్పు యంత్రంబు తంత్రంబు, నీ ప్రీతి మంత్రంబు మోహంబు గాదే!

కాంగ్రెస్ప్రభుత్వంబు గర్భంబునం దుద్భవం బంది, పెంపొందు రాజేంద్ర ప్రాసాద రాజర్షి సద్గోత్ర సంజాత, నెహ్రూ మహాపండితారాధ్యలీలా వినోదార్థ సంభూత, సర్వప్రజానీక సంస్తుత్య విఖ్యాత, సత్కార్య దుష్కార్య మీ తేర్చు నిష్పక్షపాతా, భవద్దివ్యభాగ్యంబు నందంగ నెంతేసి కృత్యాలు సేయంగగాలేద నీభక్తవర్గంబు నీవన్నులంజేరి దాస్యంబు సేయంగ సైరింపగాలేక నీదాస్యమై ముక్తి నీవశ్యమవశ్యకర్తవ్యమంచున్ మదిన్నెంచి కూనీల నెన్నేనియుం జేయగాలేద మంత్రుల్ కలక్టర్లనుంగాంచ మున్ముందు దాక్షిణ్యభావంబు కాంక్షించుదో వారి కాచిత్త సంప్రీతి సంధాయి, నీదు ప్రసాదంబు ఎమ్. ఎల్. ఎ. పట్టంబునందన్ నిమిత్తంబు, లంచాల మాటీలు నీమీది మోహంబు బాయంగగాలేక చేజాచి జేబీలలో పైచి దుర్మార్గులన్ బ్రోచి సన్మార్గులన్ హింసలన్ బెట్టుటల్ నీప్రతాపంబుగాదే, మహాసత్కవీంద్రుండు భోజక్షితీంద్రాది పూజ్యుండునౌ కాళిదాసున్ బలింగొన్న చండప్రతాపావినూత్న స్వరూపా, గవర్నర్లంటు పట్టేలయందున్న జాకారుగామూరి కాఫీ లహోటళ్ళయోనర్లు పూజింప తత్పక్షముంబూని సప్తర్షి సంఖ్యావతారంబుగా నొప్పు కామస్వరూపీ, ప్రపన్నంబు కావమ్మ, రావమ్మ, మమ్మేలు నీకేల జాగేల నీవేళ రావేల నేనీదు భక్తుండ శిష్యుండ, ముల్లోక వశ్యంబుకున్ మూలమైయుండు నీశక్తి వర్ణింప నే నెంత, నీవేడ నేనేడ, నీరూప మందొండ బ్రహ్మాండముల్ నిండియుండ న్నినున్ భక్తి పూజించు దీనాతి దీనుండ నీపాదదాసుండ, నీకీర్తి సంప్రీతిగా ప్రస్తుతింపంగ లేనట్టి బాలుండ, బ్రోవంగదే, కాట్నవంశాన్వయాంభోధి జన్ముండ, వేమయ్య పుత్రుండ మద్రాసు వాస్తవ్య డార్యప్రియుండన్ కటాక్షింపరావే ముదంబొప్పనిన్ గొల్చు నన్నావరావే నమస్తే నమస్తే నమః.